క్లుప్తంగా

75 మందికి వైద్య పరీక్షలు


రోగులకు మందులు పంపిణీ చేస్తున్న కౌన్సిలర్ రవి

మండపేట: మున్సిపల్ పరిధిలోని ఎనిమిదో వార్డులో ప్రభుత్వ ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక ఎస్సీ పేటలోని రామాలయం వీధిలో నిర్వహించిన ఈ శిబిరంలో ప్రభుత్వ వైద్యురాలు రమ్మ ప్రజలకు సేవలు అందించారు. ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు సహాయకులుగా పని చేశారు. ఆ వార్డు వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ మందపల్లి రవికుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ శిబిరంలో మొత్తం 75 మందికి పరీక్షలు చేసినట్టు ఆయన తెలిపారు. అదే వార్డుకు చెందిన టీడీపీ నాయకులు పెందుర్తి ప్రదీప్‌కుమార్, మోరంపూడి సూరిబాబు, ముమ్మిడి వరపు నారాయణలు శిబిరాన్ని సందర్శించి వారి వంతు సాయం అందించారు. కార్యక్రమంలో హెల్త్ సెక్రటరీలు ఎస్.విజయం, జీ మాధురిక, పీ రాజేశ్వరి, బీ రాధాదేవి, ఆశ వర్కర్లు పీ ఉమాదేవి, కే నాగమణి, ఆర్ దుర్గ, మంగారత్నం, కే కృష్ణవేణిలు డాక్టర్‌రమ్మ వెంట ఉన్నారు.

ఆయుష్మాన్ భారత్ అమలుపై హర్షం

మండపేట: కేంద్ర ప్రభుత్వ కొత్తగా ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ భారత పథకంపై బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కోన సత్యనారాయణ తమ హర్షాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన టౌన్ హాలు ఎదురుగా తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం దేశంలోని పేదలందరిని దృష్టిలో ఉంచుకొని ఆయుష్మాన్ భారత్ పథకానికి శ్రీకారం చుట్టిందన్నారు. ఈ పథకం పేద, మధ్య తరగతి ప్రజలకు ఎంతగానో సాయపడుతుందన్నారు. దీనిద్వారా వైద్యాన్ని ఐదు లక్షల రూపాయల వరకూ ఉచితంగా పొందవచ్చన్నారు. ఈ పథకంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. అదే విధంగా పీఎం గ్రామ సడక్ యోజన, పీఎం ఎలక్ట్రిక్ డ్రైవ్ వంటి పథకాలకు పార్లమెంటు ఆమోదం తెలిపిందని ఆయన వివరించారు.

భక్తిశ్రద్ధలతో సరస్వతీదేవి పూజ


సరస్వతి పూజ నిర్వహిస్తున్న చిన్నారులు

మండపేట: గణపతి నవరాత్ర ఉత్సవాల సందర్భంగా పట్టణంలోని బస్టాండు వద్ద కొలువుతీరిన లక్ష్మీ గణపతి మండపంలో సరస్వతీదేవి పూజా కార్యక్రమాన్ని కమిటీ నిర్వాహకులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గురువారం రాత్రి మండపం వద్ద సరస్వతీ దేవి పూజల్లో చిన్నారులు, విద్యార్థులు, మహిళలు పాల్గొని పసుపు, కుంకుమ, పూలతో పూజలు చేశారు. ఆలయ కమిటీ నిర్వాహకులు ప్రసాద వితరణ చేశారు. ఏడిద రోడ్డులోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ వద్ద నెలకొల్పిన బాల గణపతి ఆలయం వద్ద గురువారం రాత్రి దీపాలంకరణ చేశారు. కార్యక్రమంలో అయినవిల్లి రాజేష్, అయినవిల్లి నరేష్, పిల్లా విజయ్, సాధనాల శివ భగవాన్, బిళ్ళకుర్తి అంజి, కాయల సతీష్ గౌడ్, అయినవిల్లి ఆదినారాయణ, కాయల సాయిబాబు, కాయల రాము, కాయల చంద్రశేఖర్, కాయల రమేష్, రేలంగి రమేష్, రావూరి ప్రసాద్, నున్నా అంజిబాబు, జీఆర్‌సీ మోహన్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పిల్లా వీరబాబు, భక్తులు అయినవిల్లి మణి, అయినవిల్లి మహాలక్ష్మి, కాయల పద్మసుధ, అయినవిల్లి భారతి, రేలంగి జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

రామచంద్రపురం రూరల్: గర్భిణులు, బాలింతలు క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కారం నాగమణి సూచించారు. మండలంలోని వెల్లలో గురువారం పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకుని ఆరోగ్యవంతమైన సమాజం నిర్మాణంలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం గ్రామ సర్పంచ్ వీరబోయిన సూరిబాబు, ఎంపీటీసీలు చిక్కాల స్వామికాపు, మంచెం దేవి ఆధ్వర్యంలో గర్భిణులు సామూహిక సీమంతాలు నిర్వహించారు. స్థానిక నాయకులు గర్భిణులకు చీరలు అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు రాయుడు మోహన్, శ్వేత్లానా, అంగన్‌వాడీ సిబ్బంది డి.పద్మ, ఎస్.వెంకటనరసమ్మ, పి.లక్ష్మి, బి. సౌదమ్మ తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంతోనే ఆరోగ్యం

కపిలేశ్వరపురం: గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పోషకాహారం తినడం ద్వారా సామాజిక ఆరోగ్యానికి మేలు చేస్తుందని అచ్యుతాపురం పీహెచ్‌సీ పరిధిలోని నల్లూరు, కాలేరు గ్రామాల్లో నిర్వహించిన పౌష్టికాహార మాసోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న వక్తలన్నారు. ఆయా గ్రామాల్లో సర్పంచ్‌లు కరుపూడి ఉదయశ్రీ, దాయం కావేరి, ఎంపీటీసీ సభ్యులు గుడేల మధుకుమారి, టి. సత్యమంజు చేతులమీదుగా గర్భిణులకు సీమంతం చేశారు. సూపర్‌వైజర్లు పి.వెంకటలక్ష్మి, ఐ. మాణిక్యం మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలు ద్వారా అందించే పౌష్టికాహారాన్ని విధిగా క్రమం తప్పకుండా తీసుకోవాలన్నారు. అందుకు గర్భిణుల సహాయకులు అవగాహనతో మెలగాలన్నారు. కార్యక్రమాల్లో పీహెచ్‌సీ ఎంపీహెచ్ఎస్ గోపాలకృష్ణ, ఎంసీహెచ్‌పీ ధనలక్ష్మి, అంగన్‌వాడీ, ఆశ, వైద్య ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

జరభద్రం!

- నిబంధనల మేరకే నిమజ్జనాలు
- జాగ్రత్తలు పాటించకుంటే ప్రమాదాలు
- 9, 11వ రోజుల్లో నిమజ్జనాలకు ఏర్పాట్లు

కపిలేశ్వరపురం: గోదావరి నిండుకుండను తలపిస్తోంది. ఉగ్రరూపంతో పరవళ్లు తొక్కుతోంది. మరో పక్క గణేష్ నవరాత్ర ఉత్సవాలు విజయవంతంగా నడుస్తున్నాయి. ఇప్పటికే ఐదు రోజులు పూర్తి కావడంతో కొన్ని చోట్ల నిమజ్జనాలు జరుగుతున్నాయి. నిమజ్జనం సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలి.. ఈ ఉత్సవాలకు ఎక్కువ మంది గుమిగూడడంతో వైరస్, బ్యాక్టీరియ వ్యాప్తి చెంది జ్వరాలు కూడా వచ్చే అవకాశం ఉంది. అంతేకాకుండా ఉత్సవాలు ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసే అన్నసంతర్పణలో పరిశుభ్రత పాటించాలి.

ఘాట్ల వద్ద జాగ్రత్తలు

- మండపేట నియోజకవర్గంలోని తాతపూడి, కపిలేశ్వరపురం, కోరుమిల్లి, వాకతిప్ప గ్రామాల్లోని గోదావరి పుష్కర ఘాట్‌లలో విగ్రహాలను నిమజ్జనం చేస్తుంటారు. అత్యధిక విగ్రహాలు కపిలేశ్వరపురం ఘాట్‌లో నిమజ్జనం చేస్తారు. రామచంద్రపురం నియోజకవర్గంలో అత్యధికంగా కోటిపల్లి రేవు వద్ద నిమజ్జనం చేస్తారు. గతకాలంలో డప్పు వాయిద్యాలు, కోలాట నృత్యంలతో ఊరేగింపుగా గణనాథున్ని తరలించేవారు. ప్రస్తుతం సాంకేతికతతో కూడిన వాయిద్యాల మోతలో తుళ్లింతతో విగ్రహాలను నదికి తరలిస్తున్నారు.
- ఇలాంటి నేపథ్యంలో మద్యం సేవించే వారిని నిమజ్జన కార్యక్రమానికి దూరంగా ఉంచాలి. అధికారులు సూచించిన గోదావరి, కాలువ రేవుల్లోనే నిమజ్జనం చేయాలి.


అన్నసమారాధనలో వండి వార్చిన అన్నం

- నది లోతుకు దిగడం, ఈతకు వెళ్లడం ప్రమాదకరం. వాహనాల్లో విగ్రహాలను అమర్చేటప్పుడు, తరలించేటప్పుడు విద్యుదాఘాతానికి గురి కాకుండా జాగ్రత్త వహించాలి.
- వాహనాలను వేగ నియంత్రణతో నడపాలి. రాకపోకలు సాగించేవారిపై రంగులు చల్లుతూ గొడవలకు దిగడం మంచి సాంప్రదాయం కాదని గుర్తించాలి.

ఆరోగ్యానికి ప్రాధాన్యం

- అన్న సమారాధనల్లో ఆరోగ్య సూత్రాలకు ప్రాధాన్యతనివ్వాలి. రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల్లోని పలు గ్రామాల్లో జ్వరాల ప్రభావం అధికంగా ఉంది. అంగర పీహెచ్‌సీలో పడక గదులు సరిపోక సెల్లార్‌లో బెడ్లను ఏర్పాటు చేసి వైద్యం చేస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో తీసుకునే ఆహారంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. నవరాత్ర ఉత్సవాల ముగింపు సందర్భంగా నిర్వహించే అన్న సంతర్పణలో వేలాది మందికి ఒకేసారి ఆహార పదార్థాలను వండి పెడుతున్నారు. ఆహారం కలుషితమైతే ఆరోగ్య సమస్యల బారినపడే ప్రమాదం ఉంది. నిర్వాహకులు సురక్షితమైన తాగునీరు, ఏర్పాట్లు చేసుకోవాలి.
- భక్తులు అన్న ప్రసాదాన్ని ఆరగించే ముందు విధిగా చేతులను శుభ్రపర్చుకునేలా ఏర్పాట్లు చేయాలి.
- వడ్డించేవారు తరచూ చేతులను పరిశుభ్రం చేసుకోవాలి.
- వంట చేసే వారు పరిశుభ్రతను పాటించాలి. పర్యావరణానికి విఘాతం కలగని ప్లేట్లు, గ్లాసులు, సామగ్రిని వాడాలి.


కపిలేశ్వరపురం గోదావరి రేవులో నిమజ్జనం చేస్తున్న భక్తులు (ఫైల్)

నిమజ్జన సమయంలో

ఈ నెల 7వ తేదీన ప్రారంభమైన ఈ వేడుకల్లో ఏర్పాటు చేసిన మంటపాల్లోని వినాయక విగ్రహాలను భక్తులు 3, 5, 9, 11 రోజుల్లో నిమజ్జనం చేయనున్నారు. ఇప్పటికే ఐదు రోజులు గడవడంతో నిమజ్జనాలు చేస్తున్నారు. అయితే నదుల్లో నిమజ్జనం సమయంలో జాగ్రత్తగా ఉండాలి. శిబిరం నిర్వహణలో 9వ రోజైన ఈ నెల 15వ తేదీన, 11వ రోజైన 17వ తేదీల్లో నిమజ్జనం చేసేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. నిమజ్జనం, అన్న సంతర్పణ కార్యక్రమాల వెనుక ప్రజల ప్రాణాలు, ఆరోగ్య అంశాలు ముడిపడి ఉన్నాయి. గోదావరిలో వరద ఉధృతంగా ప్రవహిస్తున్న నేపథ్యంలో నిమజ్జన కార్యక్రమం ప్రమాదభరితం కానుంది. విగ్రహాల వెంట వెళ్లిన వారు నిర్వాహక కమిటీ చెప్పు చేతల్లో ఉండే అవకాశాలు తక్కువగా ఉంటాయి. కాబట్టి ఉన్నతాధికారుల సూచనలు మేరకు నిమజ్జనాలు చేయాలని ప్రతి ఒక్కరూ గుర్తించాలి. నియమ నిబంధనలను తూ.చ తప్పకుండా పాటించాలి.

వ్యక్తిగత, పరిసరాల శుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి



గోదావరి ఉధృతంగా ఉంది. గ్రామాల్లో జ్వరాలు ప్రబలుతున్నాయి. ఈ నేపథ్యంలో నవరాత్ర శిబిరాల్లో అత్యంత జాగ్రత్తలు తీసుకోవాలి. అన్న సంతర్పణ నిర్వహణలో తాగునీరు, వడ్డించే పదార్థాలు, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి. ఆహారం కలుషితమైతే వికారం, వాంతికావడమనే లక్షణాలు కనిపిస్తాయి. ఆరోగ్య సమస్యలను గుర్తిస్తే వెంటనే ఆసుపత్రికి సమాచారం ఇవ్వాలి.

– పి.రాజ్‌కుమార్, సూపరింటెండెంట్, కపిలేశ్వరపురం సీహెచ్‌సీ

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రాయవరం: గ్రామంలో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుంది. ఈ విషయాన్ని ఈపీడీసీఎల్ డీఈఈ వై.విజయానంద్ గురువారం విలేకరులకు తెలిపారు. రాయవరం గ్రామంలోని రాయవరం, మహేంద్రవాడ రోడ్, రాజరాజేశ్వరి కాలనీ, అరుంధతీయపేటల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందన్నారు. మెయింటెనెన్స్ పనుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆయన కోరారు.

మండపేట: లైన్ల మరమ్మతు పనుల నిమిత్తం ఏడిదలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ వై.విజయానంద్ తెలిపారు. శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు తెలిపారు.

రేపు రిటైర్డ్ పెన్షనర్ల సమావేశం

మండపేట: రిటైర్డ్ పెన్షనర్ల ప్రత్యేక సమావేశం శనివారం మధ్యాహ్నం మూడు గంటలకు శ్రీ రామహిందూ మున్సిపల్ పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్నట్టు విశ్రాంత ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు దేవళ్ల సత్యనారాయణ, పెన్షనర్ ఉద్యోగుల సంఘం కార్యదర్శి పెంకే గోవిందరావు తెలిపారు. ఈ సమావేశంలో ఇన్‌కంటాక్స్ రిటార్న్స్, కరవు భత్యం, రిలీఫ్ హెల్త్ కార్డులు, హెల్త్ క్యాంపులు తదితర అంశాలపై చర్చిస్తామని ఆయన తెలిపారు.

శాంతించని నది


కోటిపల్లి రేవు వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న వరద గోదావరి


కోటిపల్లి మత్స్యకార కాలనీలో ప్రవేశించిన వరద నీరు

- నిలకడగా వరద గోదావరి
- ముంపులోనే మత్స్యకార కాలనీ

కె.గంగవరం: ఇటీవల ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు ధవళేశ్వరం కాటన్ బ్యారేజీకి భారీగా వరదనీరు వచ్చి చేరుతోంది. దీంతో అధికారులు అదనపు జలాలను కాటన్ బ్యారేజ్ నుంచి సముద్రంలోకి విడుదల చేయడంతో కోటిపల్లిలో వరద ఉధృతి పెరుగుతోంది. గురువారం ఉదయం రెండు అడుగులు మేర పెరిగిన గోదావరి సాయంత్రం నుంచి నిలకడగా ఉందని స్థానికులు తెలిపారు. ఈ ఏడాది గత రెండు సార్లు వచ్చిన దాని కన్నా ఈసారి వరద గోదావరి మరింత ఉగ్రరూపం దాల్చింది. కోటిపల్లిలో మాధవనగర్, హరినారాయణవారి వీధి, నూకాలమ్మ పేట మూడు వీధులు వరదనీటిలో చిక్కుకున్నాయి. గోదావరి ఒడ్డునే ఉన్న పాకలలోకి వరదనీరు వచ్చి చేరింది. సుమారు 100 తాటాకు, పెంకుటిళ్లలోకి వరదనీరు రావడంతో వారు పక్కనే ఉన్న బంధువుల ఇళ్లలో సర్దుకున్నారు. కొందరు ముంపులోనే ఉండిపోయారు. వరద ఉధృతి కారణంగా లంకల్లోని పశువులను పాడి రైతులు గట్టుకు చేర్చి ఆశ్రయం కల్పించారు. పశువులకు ఆహారం లేక అలమటిస్తున్నాయని పాడి రైతులు వాపోతున్నారు. మరోవైపు లంకలతో పాటు గోదావరి ఒడ్డునే ఉన్న ఉద్యానవన పంటలు నీటమునిగాయి. కొబ్బరి, అరటి, మిర్చితో పాటు పలు రకాల కూరగాయల పంటలు నీట మునగడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మరో రెండు రోజుల పాటు వరద ఉధృతి కొనసాగుతుందని అధికారులు చెబుతున్నారు. కాగా ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరిని చూసేందుకు వచ్చిన సందర్శకులతో కోటిపల్లి రేవు నిండిపోయింది.


కోటిపల్లి ఫెర్రిలోని పంటు ఎక్కే దారిలో షాపుల వద్దకు వచ్చిన వరద నీరు

రైతులు ఈ-కేవైసీ చేయించుకోవాలి

కాజులూరు: ఖరీఫ్‌లో పంటలు సాగు చేసిన రైతులందరూ తప్పనిసరిగా వేలిముద్రలు వేసి ఈ-కేవైసీ చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి వి.అశోక్ సూచించారు. కాజులూరులో గురువారం ఆయన రైతులతో మాట్లాడారు. మండలంలో 18,500 ఎకరాల సాగుభూమికి గానూ 16 వేల రైతు ఖాతాలు ఉన్నాయన్నారు. వీరందరికీ గ్రామ స్థాయిలో వ్యవసాయశాఖ సిబ్బంది పంట నమోదు పూర్తిచేశారన్నారు. అన్నదాతలు రైతు సేవా కేంద్రాలకు వెళ్లి ఈ-కేవైసీ చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వీఏఏలు వి.అనూష, రమ్య తదితరులు పాల్గొన్నారు.

చెట్టు కొమ్మల తొలగింపు

సాక్షి ఎఫెక్ట్


ఎండిన కొమ్మలు తొలగించాక నిద్రగన్నేరు చెట్టు

రామచంద్రపురం: స్థానిక ఆర్డీవో కార్యాలయం సమీపంలోని హౌసింగ్ బోర్డు కాలనీకి వెళ్లే ప్రధాన రహదారి పక్కనే నిద్రగన్నేరు చెట్టు కొమ్మలు ఎండిపోయి ప్రమాదకరంగా మారింది. ఈ చెట్టు రోడ్డు మీదనే ఉండటంతో ఎండిపోయిన కొమ్మ ఏక్షణంలోనైనా కూలి పోయి ఆ మార్గంలో వెళ్లే వాహనాలు, పాదచారులపై పడే ప్రమాదం ఉంది. దీనిపై ఈ నెల 5న పొంచి ఉన్న పెను ప్రమాదం అనే శీర్షికతో ‘సాక్షి’లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఎండిపోయిన కొమ్మలను తొలగించారు. దీంతో పట్టణ వాసులు, వాహనదారులు కృతజ్ఞతలు తెలిపారు.

సామూహిక ఎలుకల నివారణతో మేలు


ఏరుపల్లిలో ఎలుకల మందు తయారు చేస్తున్న వ్యవసాయాధికారులు


పామర్రులో రైతులకు ఎలుకల మందు పంపిణీ చేస్తున్న అబ్జర్వర్ వెంకటేశ్వరరావు తదితరులు

రామచంద్రపురం రూరల్: పంట పొలాల్లో ఎలుకల నివారణకు రైతులు సామూహికంగా చర్యలు చేపట్టాలని రామచంద్రపురం సహాయ వ్యవసాయ సంచాలకులు ఏవీఎస్ రంగారావు సూచించారు. మండలంలోని ఏరుపల్లిలో గురువారం సామూహిక ఎలుకల నివారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు వేర్వేరుగా ఎలుకల నివారణ మందు పెడితే మూషికాలు పక్క పొలాలకు వెళ్లి తప్పించుకుంటాయన్నారు. అందుకే గ్రామంలోని రైతులందరూ ఒకేసారి ఎలుకల నివారణ మందును వినియోగించాలని సూచించారు. మండల వ్యవసాయాధికారి ఎస్.సత్యప్రసాద్ మాట్లాడుతూ ఎలుకల నివారణకు ప్రభుత్వం అందజేస్తున్న బ్రోమోడయోలిన్ మందును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మల్లిమొగ్గల శ్రీధర్, గ్రామ వ్యవసాయ సహాయకులు పి.రాహుల్ అంబేడ్కర్, అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

సామూహికంగానే ఎలుకలను నియంత్రించాలి

కె.గంగవరం: రైతులందరూ ఒకేసారి సామూహిక ఎలుకల నివారణ చేపట్టాలని వ్యవసాయ శాఖ అబ్జర్వర్ డి.వెంకటేశ్వరరావు సూచించారు. మండల పరిధిలోని 26 గ్రామాల్లో రైతులకు గురువారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఎలుకల నివారణ మందు పంపిణీ చేశారు. పామర్రులో జరిగిన కార్యక్రమంలో కమిషనరేట్ నుంచి వచ్చిన అబ్జర్వర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గోదావరి జిల్లాల్లో వరి పంటకు ఎలుకల వల్ల జరిగే నష్టం ఎక్కువగా ఉందన్నారు. దీని కారణంగానే ప్రభుత్వం ప్రతి సీజన్‌లో రైతులకు ఉచితంగా ఎలుకల నివారణ మందు అందజేస్తుందన్నారు. సామూహికంగా రైతులందరూ ఈ మందును వాడి ఎలుకల బెడదను నివారించుకోవాలని సూచించారు. అనంతరం రైతులకు ఎలుకల నివారణ మందు అందించారు. కుందూరులో రైతులకు ఎంపీపీ పంపన నాగమణి ఎలుకల నివారణ మందు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆత్మ పీడీ జ్యోతిర్మయి, డాట్ సైంటిస్ట్ నందకిషోర్, రామచంద్రపురం ఏడీఏ రాజశేఖర్, మండల వ్యవసాయ శాఖాధికారి బలుసు రవి పాల్గొన్నారు.

రూ.69.93 కోట్ల ఉపాధి పనులకు ఆమోదం


సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న ఏపీఓ ఈశ్వరరావు

రామచంద్రపురం రూరల్: మండలంలోని 25 గ్రామాల్లో రూ.69.93 కోట్ల అంచనాతో గుర్తించిన ఉపాధి హామీ పనులకు రామచంద్రపురం మండల సమావేశం ఆమోదం తెలిపింది. గురువారం ఎంపీపీ అంబటి భవాని అధ్యక్షతన నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో మండల ఏపీఓ మోర్త ఈశ్వరరావు సర్పంచులు, ఎంపీటీసీలకు వివరాలు వెల్లడించారు.

సీసీ రోడ్లకు రూ.15.16 కోట్లు, సీసీ డ్రైన్లకు రూ.12.22 కోట్లు, డబ్ల్యూబీఎం రోడ్లకు రూ.14.02 కోట్లు, కాంపౌండ్ వాల్స్‌కు రూ. 1.11 కోట్లు, బీటీ రోడ్లకు రూ.7.11 కోట్లు, జీపీ బిల్డింగ్స్‌కు రూ.0.5 కోట్లు, కాటిల్ షెడ్స్ నిమిత్తం రూ.0.912 కోట్లు కేటాయించారు. అంగన్‌వాడీ బిల్డింగ్స్‌కు రూ.7.02 కోట్లు, కల్వర్ట్స్ నిమిత్తం రూ.2.21 కోట్లు, ఐడీఐసీపీ వర్క్స్‌కు రూ.0.81 కోట్లు, గ్రావెల్ రోడ్లకు రూ.2.58 కోట్లు, బరియల్ గ్రౌండ్స్‌కు రూ.2.73 కోట్లతో పాటు పలు అంశాలకు నిధులు కేటాయించారు. మండలంలో 1,573 పనులకు గాను రూ.69.934 కోట్లు పనులు అంచనాలు రూపొందిచినట్లు ఏపీఓ ఈశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఈఓపీఆర్డీ ఎస్.సెలత్‌రాజు మాట్లాడుతూ గ్రామాల్లో సర్పంచులు, ఎంపీటీసీలు బాధ్యత తీసుకుని స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శాకా చంద్రశేఖరసూర్యప్రకాశ్(బాబీ), ఎంపీడీఓ ఎన్. కీర్తి స్పందన, ఏఓ చాగంటి వెంకట అచ్యుతరామ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

సీతారామ్ ఏచూరి మృతికి సంతాపం

మండపేట: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి, రాజ్యసభ సభ్యుడు, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వాసి సీతారామ్ ఏచూరి మరణానికి చింతిస్తూ మండపేట బ్రాహ్మణ సేవా సంఘం సంతాపాన్ని తెలియజేసింది. ఈ మేరకు బ్రాహ్మణ సంఘం నాయకులు శివకోటి సుబ్రహ్మణ్యం, అవసరాల వీర్రాజు, కేసరి విద్యాసాగర్, గరిమెళ్ల నాగేశ్వరరావు, అయ్యగారి విశ్వేశ్వరరావు, ఏడిద సూర్యనారాయణ, కొండూరి భాస్కరకామరాజు శుక్రవారం ఒక ప్రకటన తెలిపారు. కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

అమరులకు వీడ్కోలు

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామలో 68 రోజుల పాటు సంతాప దినాలుగా జరుపుకున్న ముస్లిం భక్తులు గురువారం కర్బలా అమరులకు వీడ్కోలు పలికారు. బార్ మే ఇమాం పంజాలో మజ్లిస్ అనంతరం మహిళలు, పురుషులు అస్కరి గుమ్మటం నుంచి ఆగా వారి పంజాకు చేరుకుని అమరులకు వీడ్కోలు పలికారు. మత గురువు మీర్జా అస్కరి హుస్సేన్ కర్బలా అమరుల త్యాగాలను వివరించారు. ద్రాక్షారామలో ముస్లిం భక్తులు అమరులకు వీడ్కోలు పలకడానికి గుర్తుగా తమ ఇళ్లపై ఎర్ర జెండాలను ఆవిష్కరించారు.

ఎయిడ్స్‌పై అవగాహన అవసరం

కపిలేశ్వరపురం: ఎయిడ్స్ వ్యాధిపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని లింక్ వర్కర్ సుజాత, ఎంపీహెచ్ఈడీ గోపాలకృష్ణ అన్నారు. కాలేరు సచివాలయంలో ‘మీకు తెలుసా’ నినాదంతో గురువారం సర్పంచ్ దాయం కావేరి అధ్యక్షతన హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కరుణేంద్రకుమారి పర్యవేక్షణలో ప్రజల్లో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వ్యాధికి సంబంధించిన సమాచారాన్ని పొందేందుకు ఏర్పాటు చేసిన నేషనల్ టోల్ ఫ్రీ ఎయిడ్స్-1097 నంబర్ వినియోగంపై సుజాత, గోపాలకృష్ణ అవగాహన కల్పించారు. ఎంఎల్‌హెచ్‌పీ ధనలక్ష్మి, ఆశ, వైద్య ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

కేశవరం రైల్వే వంతెన నిర్మాణానికి తొలి అడుగు

స్థలాన్ని పరిశీలించిన రైల్వే ఉన్నతాధికారులు


కేశవరం గేటును పరిశీలిస్తున్న రైల్వే అధికారులు, ఇతర అధికారులు

మండపేట: మండలంలోని కేశవరం రైల్వే ఓవర్ బ్రిడ్జి(ఆర్‌ఓబీ) నిర్మాణానికి తొలి అడుగులు పడబోతోంది. ఈ ప్రాంతంలో ఆర్‌ఓబీ నిర్మాణం చేపట్టేందుకు దక్షిణ మధ్య రైల్వే ఉన్నతాధికారులు సుందర్‌సెన్, షాజన్, త్రినాథ్ గురువారం కేశవరం గేటును సందర్శించారు. వారొచ్చారని సమాచారం అందుకున్న ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు గ్రామానికి వెళ్లారు. అలాగే రామచంద్రపురం ఆర్డీవో సుధాసాగర్, తహసీల్దార్ తేజేశ్వరరావు, ఆర్అండ్‌బీ తదితర శాఖల అధికారులు కూడా అక్కడికి చేరుకుని పరిశీలించారు. సర్పంచ్ పెదపాటి సత్యనారాయణ, ఎంపీటీసీ అన్నందేవుల కృష్ణారావు, గ్రామస్తులు సలహాలను తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేగుళ్ల మాట్లాడుతూ త్వరలో కేశవరం రైల్వే గేటు కష్టాలు తీరబోతున్నాయన్నారు. ఆర్వోబీ నిర్మాణానికి సంబంధించిన స్ట్రక్చర్ రెడీ అయిందన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ ఐదం రాజు, రెవెన్యూ సిబ్బంది, దేవదాయ శాఖ, గ్రామస్తులు పాల్గొన్నారు.